క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగులు ఫారం-16 తీసుకోవాలి

గిద్దలూరు రూరల్: ఈ సంవత్సరానికి ఆదాయపు పన్ను చెల్లించిన విశ్రాంత ఉద్యోగులు ఫారం-16 తమ కార్యాలయంలో తీసుకోవాలని విశ్రాంత ఉద్యోగ సంఘ అధ్యక్షుడు రవీంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 30వ తేదీలోపు ఈ ఫైల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. పాన్ నంబర్ తెలియజేస్తే ఫారం-16 డౌన్‌లోడు చేసి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ముండ్లమూరు జెడ్పీ హెచ్‌ఎంగా రమేష్‌బాబు

ముండ్లమూరు: ముండ్లమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా కాకాని రమేష్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ హెచ్‌ఎంగా పని చేసిన సుజాత సాధారణ బదిలీల్లో భాగంగా అద్దంకి మండలం వెళ్లారు. ఆమె స్థానంలో అద్దంకి మండలం మైలవరం హెచ్‌ఎంగా పని చేస్తున్న రమేష్‌బాబు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.

రేషన్ కార్డుదారులకు కందిపప్పు ఇవ్వాలి

దర్శి: మండలంలోని రేషన్ షాపుల్లో 2 నెలల నుంచి కందిపప్పు ఇవ్వడం లేదని సీపీఎం దర్శి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు అన్నారు. సీపీఎం ప్రతినిధి బృందంతో కలిసి గురువారం తహసీల్దార్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. సీపీఎం దర్శి మండల నాయకులు సందు వెంకటేశ్వరరావు, ఈమని నాగేశ్వరరావు, ఉప్పు నారాయణ, షేక్ కాలేబాషా, గర్నిపూడి జాన్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ముండ్లమూరు: గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ఎల్.సంపత్‌కుమార్ సూచించారు. మండలంలోని శంకరాపురం, నూజిళ్లపల్లి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పలు సలహాలు, సూచనలు చేశారు. నూతన వ్యక్తులు గ్రామంలో కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రధానంగా రాత్రి వేళల్లో అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామస్తులు ఐక్యంగా ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలను అరికట్టవచ్చన్నారు.

బాధ్యతలు స్వీకరించిన పోస్టల్ సూపరింటెండెంట్


శ్రీనివాస్

మార్కాపురం టౌన్: మార్కాపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా కె.శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నానికి చెందిన ఆయన మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి బదిలీపై మార్కాపురం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు. ఇప్పటి వరకు నెల్లూరు పోస్టల్ సూపరింటెండెంట్ మార్కాపురానికి ఇన్చార్జిగా వ్యవహరించారు.

తాళ్లూరు ఈఓఆర్డీగా కేజీఎస్ రాజు


బాధ్యతలు స్వీకరించిన రాజు

తాళ్లూరు: మండల ఈఓఆర్డీగా కేజీఎస్ రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాజు మార్టూరు మండల ఈఓఆర్డీగా పనిచేస్తూ బదిలీపై తాళ్లూరు వచ్చారు. తాళ్లూరు గ్రామ కార్యదర్శిగా జె.లక్ష్మీకాంత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మేదరమెట్ల కార్యదర్శిగా పనిచేస్తూ బదిలీపై లక్ష్మీకాంత్ ఇక్కడకు వచ్చారు.

నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

తాళ్లూరు: రైతులు ఆశించిన దిగుబడులు సాధించేందుకు, నేలలకు అనువైన నాణ్యమైన విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు అన్నారు. శివరామపురంలో గురువారం ఆయన రైతులతో సమావేశమయ్యారు. ఖరీఫ్ సాగుకు అనుకూలమైన వాతావరణ పరిస్థితుల ఆధారంగా ప్రతి కూలతలను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవాలని కోరారు. వరిలో బీపీటీ 2782 భవతి, బీపీటీ 2411 పరుంమ, ఎంపీటీయూ 1282, బీపీటీ 2295 బాపట్ల మసూరి, బీపీటీ 2776 రకాలు మంచి దిగుబడి ఇచ్చే రకాలను చెప్పారు. తక్కువ కాల పరిమితి కలిగి 120 రోజుల్లో పంట చేతికి వచ్చే రకాలైన ఎంపీయూ 1273 , 1295, 1275, ఎన్ఎల్ఆర్ 3354 ధాన్యరాశి, ఎంపీయూ 1121 శ్రీధృతి, ఎంటీయూ 1210, బీపీటీ 3082, ఎన్ఎల్ఆర్ 3238 రకాలు విత్తనాలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు చెప్పారు.

రెవెన్యూ సదస్సుకు 6 అర్జీలు

కందుకూరు రూరల్: మండలంలోని జి.మేకపాడులో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆరు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ డి.సీతారామయ్య తెలిపారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఒక అర్జీ, మిగిలిన ఐదు అర్జీలు వెబ్ లాండ్ అడంగల్‌లో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని ఇచ్చారు. వీటిని పరిశీలించి తదనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు ఆయా గ్రామాల్లోనే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. రెవెన్యూ రికార్డులను ప్రకారం సమస్యలను వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు.

శాస్త్రోక్తంగా ఆలయ ప్రతిష్ట


ప్రత్యేక పూజల్లో మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అన్నా

కురిచేడు: మండలంలోని రెడ్డెన్నపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండరామాలయం, జీవధ్వజ, కలశ, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు గురువారం పారంభమయ్యాయి. కార్యక్రమాలకు దర్శి మాజీ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు ఆయనతో ప్రత్యేక పూజ చేయించి అక్షింతలు వేయించారు. గ్రామస్తులు ప్రతిష్ట మహోత్సవానికి కంకణం కట్టుకున్నారు. వారితో గణపతి పూజ, హోమాలు, ధాన్యాధివాసం, జలాదివాసం, కలశాభిషేకం తదితర పూజలు మూడు రోజులపాటు చేయించనున్నారు. శనివారం ప్రతిష్ట కార్యక్రమం, శాంతి కల్యాణం చేయనున్నారు. కార్యక్రమానికి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ కాసు బ్రహ్మారెడ్డి, సర్పంచ్ కాసు భాస్కరరెడ్డిలు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరగంథం కోటయ్య, నుసుం ప్రతాప్‌రెడ్డి, గోగులముడి లింగారెడ్డి, ధనిరెడ్డి వెంకటరెడ్డి, కాకర్ల కృష్ణారెడ్డి, ధనిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పుల్లలచెరువు: మండలంలోని మల్లాపాలెంలో గురువారం జరిగిన పోలేరమ్మ తల్లి గుడి, గంగమ్మ తల్లి, ఆంజనేయస్వామి, బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. మంత్రితో పాటు ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, వై.పాలెం, పుల్లలచెరువు మండలాల కన్వీనర్లు ఓబుల్‌రెడ్డి, రెంటపల్లి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వాగ్యానాయక్, వైస్ సర్పంచ్ రవణారెడ్డి, నాయకులు భూమిరెడ్డి సుబ్బారెడ్డి, మర్తాల సుబ్బారెడ్డి, శనగా సుబ్బారెడ్డి, రమణయ్య పాల్గొని దేవతామూర్తులను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మంత్రి సురేష్‌ను ఘనంగా సన్మానించారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రేడియో బావి సమీపం అభయాంజనేయస్వామి ఆలయం ఆవరణలో గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సరస్వతి, నందీశ్వర, దక్షిణామూర్తి, చండీశ్వర, ఒంటే వాహనం వంటి దేవతా విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉమామహేశ్వరస్వామికి అభయాంజనేయస్వామి వార్లకు అభిషేకాలు చేశారు. మహేశ్వర అపార్ట్‌మెంట్ ఎండీ బాలాజీనాయక్ ఆర్థిక సాయంతో అన్నదానం చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు చేరెడ్డి యర్రారెడ్డి, పాలుగుళ్ల అనసూయమ్మ, దండెబోయిన రమణ, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు

రాజంపల్లి (పెద్దారవీడు): మండలంలో రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత గొడ్రాలి కొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామికి ప్రజలు భక్తిశ్రద్ధలతో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించి పట్టువస్త్రాలు, పూలమాలతో అలంకరించారు. ఉభయదాతలు ఏనుగులదిన్నెపాడు గ్రామానికి చెందిన గ్రంథే సుబ్బయ్య, పడిగలయ్య, యానయ్య, వెంకయ్య కుమారులు వ్యవహరించారు. ఆలయం ప్రాంగణంలో గజ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథస్వామిని మేళ తాళాలతో ఊరేగించారు. భక్తుల కోసం బ్రహ్మణ, ఆర్యవైశ్య, రెడ్ల సత్రాల్లో అన్నదానం చేశారు. శుక్రవారం ఉదయం సీనియర్ విభాగం పశు బలప్రదర్శన, సాయంత్రం రథోత్సవం, పలు కులాల సత్రాల్లో అన్నదానం, రాత్రికి విద్యుత్ ప్రభలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

విగ్రహ ప్రతిష్టకు హాజరైన ఎమ్మెల్యే అన్నా

కంభం: స్థానిక జయప్రకాష్ వీధిలోని శ్రీరాములవారి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ట మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, ఔరంగబాద్ మాజీ సర్పంచ్ సబ్బసాని సాంబశివారెడ్డి, కొత్తపల్లి శ్రీను, ఎంపీటీసీ ఇమ్మడి నాగరాజు, కటికల భాస్కర్, కృష్ణ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కురిచేడు: స్థానిక ఎన్ఎస్పీ కాలువ కట్టపై పొట్లపాడు దారిలో నూతనంగా వెలసిన శ్రీ నిదానంపాటి లక్ష్మి అమ్మవారి దేవాలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. వేదపండితుడు నారాయణం వెంకటేశ్వర్లు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, గుంటక నాసర రెడ్డి, ఇందూరి వెంకట నర్సయ్య, మేరువ నాగిరెడ్డి పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ, భక్తులు


అన్నదానం చేస్తున్న బాలాజీనాయక్


హోమం చేస్తున్న భక్తులు


పూజలు చేస్తున్న వేదపండితులు

కురిచేడు: స్థానిక శ్రీ కోనవల్లభరాయస్వామి కొండపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంపై గురువారం కలశస్థాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధన, కలశ ఆవాహనం, కలశాభిషేకం, స్వామివారికి ప్రత్యేక అభిషేకం, సుదర్శన యాగం చేశారు. భక్తులు విరివిగా పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

కొమరోలు: మండలంలోని రెడ్డిచెర్లలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథస్వామి దేవాలయ 12వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం తెల్లవారు జాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో తిరుమలనాథస్వామికి పాలాభిషేకం చేసి భజన కార్యక్రమాలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.


ప్రత్యేక పూజలు చేస్తున్న డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి

ఆశించిన స్థాయిలో లేని దేశాభివృద్ధి

యర్రగొండపాలెం: స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత దేశంలో ప్రజలు ఆశించిన మేరకు అభివృద్ధి జరగలేదని రచయిత తన కావ్యంలో వరించారని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీధర్‌నాయుడు అన్నారు. గురువారం ప్రముఖ కవి దేవుల పల్లి విశ్వనాథం రచించిన ×స్వతంత్ర భారతి¤ పుస్తకావిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. తల్లి,కుమారుల సంభాషణ రూపంలో అందరికీ అర్థమయ్యే రూపంలో కావ్యాన్ని రచియిత ఆవిష్కరించారని పేర్కొన్నారు. రచయిత మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధులు ఆశించిన మేరకు దేశంలో మార్పు రాలేదని పేర్కొన్నారు. అనంతరం పుస్తక రచయిత దేవులపల్లి విశ్వనాథాన్ని ఘనంగా సన్మానించారు. అధ్యాపకులు శ్రీనివాసాచార్యులు, రామకోటయ్య, ప్రదీప్, సుజాతమ్మ, శ్రీనివాసులు, విజయ నాయక్, వెంకటేశ్వర రెడ్డి, వల రాజు, రాజా నాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి


మాట్లాడుతున్న బాలాజీ నాయక్

● ఏడీఏ అర్జున్ నాయక్

పొదిలి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను రైతులకు అందించడంతోపాటు సాగులో మెళకువలు, సస్యరక్షణ చర్యల గురించి అవగాహన కల్పించాలని దర్శి ఏడీఏ కె.బాలాజీ నాయక్ సూచించారు. గురువారం పొదిలి వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ.. ఆర్బీకే సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ రైతు భరోసా, పొలం బడి, పంట నమోదు, ఉచిత పంటల బీమా, సీసీఆర్సీ తదితర పథకాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఆర్బీకేల సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎస్కే జైనులాబ్దిన్, ఏఈఓలు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

శుభకార్యాలకు హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్


చిన్నారులను ఆశీర్వదిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాదరెడ్డి

దర్శి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు గురువారం రాత్రి పట్టణంలో పలు శుభకార్యాలకు హాజరయ్యారు. ప్రముఖ హోమియో వైద్యుడు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ఎం బాషా కుమారుని ఒడుగుల వేడుకలకు హాజరై ఆశీర్వదించారు. స్థానిక పుచ్చలమిట్టలో టీచర్ మస్తాన్ మక్కాకు వెళ్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. మక్కా యాత్ర శుభంగా జరగాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూచేపల్లి అభిమానులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానంపై తరగతులు

కందుకూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా విధానాన్ని జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా శాస్త్రం, వృత్తి విద్యపై వివిధ సదస్సులు నిర్వహించనున్నట్లు కేంద్ర విద్యాలయం ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్ తెలిపారు. ఇందులో భాగంగా కందుకూరు కేంద్ర విద్యాలయంలో ప్రతి రోజు వర్చువల్ విధానంపై అవగాహన కల్పిస్తూ జాతీయ విద్యా విధానంపై తరగతులు నిర్వహిస్తామన్నారు. ఒక్కో అంశంపై ఒక్కో ఉపాధ్యాయుడితో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

ఎస్వీకేపీ కళాశాల అధ్యక్షుడిగా యక్కలి


బాధ్యతలు స్వీకరిస్తున్న కాశీవిశ్వనాథం

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో పేరొందిన మార్కాపురం పట్టణంలోని ఎస్వీకేపీ కళాశాల అధ్యక్షుడిగా యక్కలి కాశీవిశ్వనాథం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దుతానని చెప్పారు. ఆయన్ను వంశ పారంపర్య అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి నరసింహులు, ప్రిన్సిపాల్ బి.దీపా, కమిటీ సభ్యులు ఐ.నాగేశ్వరరావు, బాలసుబ్బారావు, నాసరయ్య అభినందించారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యేలు


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల

మార్కాపురం: ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోదరుడు, కొండేపల్లి ఎంపీటీసీ కుందురు మల్లారెడ్డి, దివ్య దంపతుల వివాహం గురువారం స్థానిక సెవెన్ హిల్స్ కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు వెన్నా హనుమారెడ్డి, షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎల్పీ యాదవ్, టీడీపీ, జనసేన పార్టీ ముఖ్య నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

మాజీ ఎమ్మెల్యే కేపీని పరామర్శించిన ఎంపీ మోపిదేవి


మాజీ ఎమ్మెల్యే కేపీతో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి

మార్కాపురం: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కేపీ కొండారెడ్డిని గురువారం మార్కాపురంలోని ఆయన నివాసంలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ పరామర్శించారు. మార్కాపురంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన అనంతరం కేపీ కొండారెడ్డి నివాసానికి చేరుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. కేపీ కొండారెడ్డి కుమారుడు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డితో మాట్లాడారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రంగారెడ్డి, గాయం నాగేంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు


మాట్లాడుతున్న కమిషనర్ నారాయణరావు

కనిగిరి రూరల్: ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం వార్డు రెవెన్యూ, ప్లానింగ్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ డీవీఎస్ నారాయణరావు మాట్లాడుతూ పట్టణంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ, వాగు పొరంబోగు, చెరువు, కుంటలు తదితర ఆక్రమిత ప్రభుత్వ భూములను గుర్తించి తక్షణం నివేదిక ఇవ్వాలన్నారు. అనుమతి లేని, అక్రమ కట్టడాలను గుర్తించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా సీతారాముల కల్యాణం


నల్లగండ్లలో సీతారాముల కల్యాణం

హనుమంతునిపాడు: మండలంలోని నల్లగండ్లలో గురువారం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య బత్తుల వెంకటేశ్వరెడ్డి దంపతులు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

హనుమంతునిపాడు: స్పందనకు వచ్చిన ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ ఎస్ హరిబాబు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో వివిధ శాఖలకు సంబంధించి 10 అర్జీలు వచ్చాయని, ప్రతి అర్జీకి సంబంధించి గ్రామాల్లోకి వెళ్లి విచారించి పరిష్కరించాలన్నారు.

పలువురు హెచ్‌ఎంలు బాధ్యతల స్వీకారం


హెచ్‌ఎం సుధాకర్


బాధ్యతలు స్వీకరిస్తున్న రాఘవయ్య

పుల్లలచెరువు: మండలంలోని ముటుకుల జెడ్పీ పాఠశాల హెచ్‌ఎంగా రామిరెడ్డి రాఘవయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముటుకుల యూపీ పాఠశాలను ఈ ఏడాది అప్‌గ్రేడ్ చేసి పదో తరగతి వరకు పెంచారు. జిల్లాలో ఇటీవల హెచ్‌ఎంల పదోన్నతులు ఇవ్వడంతో ముటుకుల మొదటి హెచ్‌ఎంగా రాఘవయ్య బాధ్యతలు స్వీకరించడంతో ఉపాధ్యాయులు హెచ్‌ఎంకు అభినందనలు తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

తర్లుపాడు జెడ్పీ హెచ్‌ఎంగా సుధాకర్

తర్లుపాడు: దశాబ్దాల చరిత్ర కలిగిన తర్లుపాడు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎంగా ఎం. సుధాకర్ నియమితులయ్యారు. ఇటివల జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన పెద్దరావీడు మండలం కలనూతల జెడ్పీ పాఠశాల నుంచి బదిలీపై వచ్చారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి పెడతానని తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన హెచ్‌ఎం మాధవి బదిలీపై కురిచేడు పాఠశాలకు వెళ్లారు.